తెల్లబోయిన పత్తి రైతు

- పెరిగిన పెట్టుబడి... తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో దక్కని కనీస మద్దతు ధర
- ప్రారంభంకాని సీసీఐ కేంద్రాలు
- ప్రైవేటు మిల్లుల్లో జోరుగా కొనుగోళ్లు
- తేమ పేరుతో ధర తగ్గింపు..
  తూకంలో మోసాలు
- క్వింటాల్‌కు రూ.2వేలు
  నష్టపోతున్న రైతాంగం

ఖమ్మం ఏఎంసీకి రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

(నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్): ఈ ఏడాది పత్తి రైతు తెల్లబోయిండు. తొలుత అనావృష్టి, తర్వాత అతివృష్టి పత్తిరైతును నిండామునిచాయి. అష్టకష్టాల నడుమ పంట చేతికొచ్చాక మార్కెట్‌లో పత్తి రైతులకు మద్దతు కరువైంది. ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రాల ఊసేలేకపోవడంతో ఎక్కడ అమ్ముకోవాలో తెలియక మళ్లీ తెల్లబోవడం పత్తి రైతు వంతైంది. వానకాలం ఆరంభంలో వర్షాభావం వల్ల రైతులు పత్తి విత్తనాలను ఒకే సారి గాకుండా రెండు మూడుసార్లు నాటారు. తర్వాత ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవటం వల్ల పత్తి పంటలో చెట్లు ఏపుగా పెరగలేదు. ఒక్కో చెట్టు మూడు నుంచి నాలుగు అడుగులకే పరిమితమైంది. కోత దశలోనూ వానలు పడుతుండటంతో ఒక్కో ఎకరం పత్తి పంటలో పత్తి కోసేందుకు కూలీల అవసరం ఆరు నుంచి తొమ్మిది మందికి పెరిగింది. దూదికి బదులు కాయను తీసి తర్వాత వేరు చేయాల్సి వస్తోంది. ఫలితంగా పెట్టుబడి భారం పెరిగింది. గతంలో పత్తిపంటలో ఐదారుసార్లు కోత ఉండేది. ఇపుడు మూడుసార్లు కోయగానే పంట లూటిఅవుతోంది. ఒక్కో ఎకరం పత్తి పంట నుంచి గతంలో వచ్చిన 10 నుంచి 12 క్వింటాళ్ల వచ్చే దిగుబడి ప్రస్తుతం యాభైశాతానికి పడిపోయింది.

ఎకరానికి పెట్టుబడి ఇలా...

రైతులు ఎకరం భూమిలో పత్తిని సాగు చేయడానికి అయ్యే పెట్టుబడి 3 సార్లు దుక్కి దున్నడానికి రూ.4500లు, అచ్చు చేయడానికి రూ.1500, రెండు విత్తనాల ప్యాకెట్లు రూ. 1700, విత్తనాలు నాటడానికి కూలీలు రూ. 900, గొర్రు తోలడానికి రూ. 6వేలు, కలుపు తీయడానికి రూ.5వేలు, మందులకు రూ.2వేలు, ఎరువుల బస్తాలకు రూ.4వేలు, మందుల పిచికారికి రూ. 5వేలు, ఎకరాకు వచ్చే దిగుబడి 3 క్వింటాల్ పత్తి ఏరడానికి రూ.4,500లు, ఒక్క ఎకరానికి సుమారుగా రూ.35,100 పెట్టుబడి అవుతుండగా, ఎకరాకు దిగుబడి 3నుంచి 4 క్వింటాల్ దిగుబడి వస్తుంది. క్వింటాల్ పత్తికి రూ.7వేల చొప్పున 4క్వింటాళ్ల పత్తికి రూ.28వేలు మాత్రమే వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరకు మద్దతు ధర కల్పించినప్పటికి రైతులకు పెట్టుబడి వచ్చే అవకాశం ఏ కోశాన లేదు. కాగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడింది.

కనీస మద్దతు కరువు

పెట్టుబడి పెరగటం, దిగుబడి తగ్గిన నేపథ్యంలో పత్తి రైతులకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర కూడా లభించటం లేదు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్లలో రెండోది. ఈ ఏడాది ఏ ఒక్కరోజూ క్వింటా పత్తికి గరిష్ఠ ధర ప్రభుత్వ మద్దతు ధరను మించలేదు. ఈ ఏడాది ఇప్పటివరకు పత్తి రైతులకు ఇక్కడ గరిష్ట ధర క్వింటాకు రూ.7500 మాత్రమే దక్కింది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర పత్తి క్వింటాకు రూ.7,521.

తేమ పేరుతో ధర తగ్గింపు

సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో చేస్తున్న జాప్యం అన్నదాతకు శాపంగా మారితే.. వ్యాపారులకు వరంగా మారుతున్నది. పత్తి సేకరణ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా.. సీసీఐ జాడ లేకపోవడంతో గ్రామాల్లో కమీషన్ ఏజెంట్లు, పట్టణ కేంద్రాల్లో చిల్లర కాంటా వ్యాపారులు..మిల్లుల్లో యజమాన్యం రైతుల వద్ద పత్తిలో తేమ ఆధారంగా ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నది. అధికారులు పట్టించుకోకపోవడంతో నాణ్యత ఉన్నా వ్యాపారులు మాత్రం ధర తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. మిల్లుల్లో యజమానులు, బయట మధ్యవర్తులు మంచి పత్తికి కూడా సవాలక్ష వంకలు పెట్టి ధర తగ్గించి కొంటున్నారు. వాస్తవానికి 8శాతం తేమ ఉంటే ఎ-గ్రేడ్ రకం పత్తిగా క్వింటాల్‌కు రూ.7,521, తేమ 9 నుంచి 12 శాతం ఉంటే ఒక్కో శాతానికి రూ.75 తక్కువగా కొనుగోలు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి. ప్రైవేటు మిల్లుల్లో యజమానులు, ఏజెంట్లు, మధ్యవర్తులు మాత్రం రూ. 5,500 నుంచి రూ.6,250 వరకు చేతిలో పెడుతున్నారు. దీంతో ఒక్కో రైతు రూ.1000 నుంచి రూ.2000 వరకు ధరలో నష్టపోతున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, తేమ శాతాన్ని సూచించే యంత్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అటు మిల్లుల్లో, ఇటు చిల్లర కాంటాల వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. నాణ్యతాప్రమాణాలు బాగానే ఉన్నా.. తేమ యంత్రాల్లో మాయాజాలంతో రైతన్న నెత్తిన టోపీ పెడుతున్నారు. వాహనాల డ్రైవర్లకు కమీషన్లు ముట్టజెప్పి రైతులు తెచ్చిన పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

పత్తి చేను తీసేస్తున్నా

నేను 1.10 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. అకాల వర్షాలు, వాతావరణం అనుకూలించకపోవడం వలన 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం లేదు. డిసెంబరు వరకు కాయాల్సిన పత్తి, పూత, కాత లేకపోవడంతో ఈనెలలోనే తొలగిస్తున్నాం. దిగుబడి లేక.. ధర రాక అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది.

-మల్లయ్య, రైతు, కల్వల

కౌలుపైసలూ రావు

ఎకరానికి రూ.15 వేల కౌలు ఒప్పందంతో నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. మొత్తం నాలుగు ఎకరాలకు రూ.1.40 లక్షల పెట్టుబడి పెడితే.. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేట్టు కనిపించడం లేదు. ఈ రోజు మొదటితీతలో తీసిన పత్తి పంటను తీసుకొస్తే క్వింటాల్ రూ.6,700కు అడిగారు. దీంతో కౌలు బాకీ కూడా పూడేటట్టు లేదు.

-కేరంగారావు, రైతు, ఖమ్మం జిల్లా

గుజరాత్ పత్తికి ధర ఎక్కువ ఎందుకు?

- వన్ నేషన్..వన్ ఎమ్మెస్పీ లేదేం?
- పత్తి కొనుగోళ్లపై కేంద్రం ద్వంద్వనీతి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తేతెలంగాణ): 'వన్ నేషన్-వన్ ట్యాక్స్, వన్ రేషన్- వన్ ఎలక్షన్- వన్ మార్కెట్' అంటూ ఊదరగొడుతున్న కేంద్రం పత్తి కొనుగోళ్లలో వన్ నేషన్-వన్ ఎమ్మెస్పీ పాటించడంలేదేందుకని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. ప్రధాని మోదీ స్వరాష్ట్రంలో పత్తికి క్వింటాల్‌కు రూ.8,257 మద్దతు ధర ఇస్తుండగా, తెలంగాణలో పత్తికి రూ. 7,521 ఇవ్వడంలో అంతర్యమేంటి? ఎందుకు ఈ వ్యత్యాసం? అంటూ గురువారం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా రైతులపై వివక్షను చూపడమానీ అన్ని రాష్ట్రాల్లో పత్తికి ఒకే విధమైన మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఐదు డీఏలు విడుదల చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగుల హామీలను విస్మరించారు
- 23న క్యాబినెట్‌లో చర్చించి ప్రకటించాలి : హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిపడిన 5 డీఏలను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో 17.29 శాతం డీఏలపై చర్చించి, దీపావళి కానుకగా బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. గురువారం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుకగా మూడు శాతం కరువు భత్యం ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలను గుర్తు చేస్తున్నానని అన్నారు. డీఏలు విడుదల చేయకపోవడం వల్ల ఒక్కో ఉద్యోగి నెలకు సుమారు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు నష్టపోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మార్చి 31 తర్వాత రిటైర్డ్ అయిన సుమారు 5వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన నూతన ఈహెచ్ఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలకు భద్రత కల్పించండి

- తులం బంగారంపై కాంగ్రెస్ మాట మార్చింది : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బతుకమ్మ చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బంద్ చేసిందో చెప్పకుండా మంత్రి సీతక్క పొంతనలేని వ్యాఖ్యలు చేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎక్స్ లో గురువారం ఓ ప్రకటనను పోస్టు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా రూ. 300 కోట్లతో బతుకమ్మ చీరలు పంపిణీ చేసిందనే సత్యాన్ని ఒప్పుకున్నందుకు ముందుగా మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. మహాలక్ష్మి పథకానికి రాష్ట్రంలోని రేషన్‌కార్డు కలిగి ఉన్న 93 లక్షల కుటుంబాలలో 18 ఏళ్ల నిండిన ఒక్క మహిళను అర్హులుగా తీసుకుంటే.. 10 నెలలుగా నెలకు ₹ 2,500 చొప్పున ఒక్కొక్కరికీ ₹25,000 వేలు బాకీ పడ్డారు అని మాజీ మంత్రి లెక్కలు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రూ. 23,250 కోట్లు మహిళలకు బాకీ పడిందని తెలిపారు. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా, మోసం చేయడమే కాకుండా, రూ. 3,325 కోట్ల లెక్క చెప్పి, చెల్లించాల్సిన రూ. 23,250 కోట్లు కప్పిపుచ్చారని విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు.



రైతు అంజయ్య,రాజబాబు (ఫైల్)

ఇద్దరు రైతుల ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో ఒకరు.. పంట దిగుబడి రాక మరొకరు
- సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో అన్నదాతల బలవన్మరణం

దుబ్బాక/ వర్ధన్నపేట, అక్టోబర్ 17: అప్పుల బాధతో వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు గురువారం చోటు చేసుకున్నాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్ల పల్లికి గ్రామానికి చెందిన వెల్పుల అంజయ్య(51) తనకున్న ఎకరంతో పాటు మరో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయం, ఇతర అవసరాల కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మానసికంగా కుంగిపోయిన అంజయ్య గురువారం పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు భూంపల్లి ఎస్సై హరీశ్ వెల్డించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పోశాల రాజబాబు(45) మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. గతేడాది, ఈ ఏడాది కూడా పంట దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.15లక్షల దాకా అప్పులయ్యాయి. దీనికి తోడు పంటకు గిట్టుబాటు ధర కూడా రాకపోవడంతో అప్పులు ఎలా చెల్లించాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన రాజబాబు.. గురువారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నట్టు స్థానికులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లోన్ కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్ బలవన్మరణం

షేక్ కయ్యుం (ఫైల్)

ఎడపల్లి, అక్టోబర్ 17: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ కయ్యుం(45) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలం క్రితం ఇల్లు నిర్మించుకునేందుకు ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ. 2లక్షలు లోన్ తీసుకున్నాడు. నాలుగు నెలల క్రితం పక్షవాతానికి గురైన కయ్యుంకు లోన్ కిస్తీలు కట్టడంతోపాటు ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై బుధవారం జాన్కంపేట్ సమీపంలోని అశోక్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరోటౌన్ పోలీసులు గురువారం మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి భార్య గౌసియా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ విరమణ

- టీపీడీఎంఏ నేతలతో 'బుర్రా' చర్చలు
- బకాయిల విడుదలకు హామీ

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తరపున విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం హామీ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌ను విరమించుకుంటున్నట్టు తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నేతలు తెలిపారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. అంతకుముందు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఇతర బీసీ సంఘాల నేతలు ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బకాయిల చెల్లింపు, క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. తప్పని సరి పరిస్థితుల్లోనే కాలేజీలను బంద్ పెట్టాల్సి వచ్చిందని ఆయనకు వివరించారు. కాగా, సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలతో గురువారం సచివాలయంలో బుర్రా వెంకటేశం టీపీడీఎంఏ నేతలతో చర్చలు జరిపారు. బకాయిల విడుదలకు చర్యలు చేపడతామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కాలేజీల బంద్‌ను విరమిస్తున్నామని నేతలు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగే మల్లేశ్‌యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, టీపీడీఎంఏ నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పత్తికి గుజరాత్ ధర కల్పించాలి

మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో పండే పత్తికి కేంద్ర ప్రభుత్వం గుజరాత్ ధర చెల్లించాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి పత్తి చాలా నాణ్యమైనదని పలు పరిశోధన అధ్యయనాల్లో వెల్లడైందని వివరించారు. ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలుగా బీజేపీకి చెందిన వారు ఉన్నారని, ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రైతులకు గుజరాత్ ధర వచ్చేలా చూడాలని సూచించారు.

సీపీఐ ఆందోళన

పత్తి రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో రైతులతో కలిసి రాస్తారోకో చేస్తున్న సీపీఐ, రైతు సంఘం, బీఎస్పీ నాయకులు - బోయినపల్లి

సర్కార్‌కు పత్తిరైతు గోసపట్టదా?

- సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే తీవ్రనష్టం
- పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం ఇవ్వాలి
- క్వింటాల్‌కు రూ. 475 బోనస్ హామీని నిలబెట్టుకోవాలి
- బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్‌కు పత్తిరైతు గోసపట్టదా? అని బీఆర్ఎస్ సీనియర్‌నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పత్తికొనుగోళ్లపై నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి దాకా కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ధాన్యానికే కాకుండా పత్తికీ క్వింటాల్‌కు రూ. 475 బోనస్ ఇస్తామని మేనిఫేస్టోలో పేర్కొన్నదని గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో, వచ్చిన కొద్దిపాటి పత్తిని రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పీనీ అన్ని కేంద్రాల్లో అమలయ్యేలా చూడాలని, లేకుంటే సర్కార్‌పై రైతుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గత 45 రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా నష్టపోయిందని, పంట పెట్టుబడులు కూడా వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల గోసను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

నేటి నుంచి ఫార్మసీ కాలేజీల బంద్

- సీఎం రేవంత్‌రెడ్డి హామీకి అతీగతిలేదు
- ఫార్మసీ కాలేజీల యాజమాన్య సంఘం మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో ఫార్మసీ కాలేజీలను శుక్రవారం నుంచి నిరవధికంగా బంద్ చేయనున్నట్టు ఫార్మసీ కాలేజీల యాజమాన్య సంఘం ప్రకటించింది. యూనియన్ ప్రెసిడెంట్ టీ జైపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కే రామదాసు, జనరల్ సెక్రటరీ పుల్ల రమేశ్‌బాబు గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రూ. 550 కోట్ల రీయింబర్స్‌మెంట్‌ను పెండింగ్‌లో పెట్టిందని వాపోయారు. ఐదు నెలల నుంచి పలు మార్లు విజ్ఞప్తిచేసినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. మూడు నెలల క్రితం జేఎన్టీయూలో జరిగిన సమావేశంలో నెలలోపు ఫీజు మొత్తాన్ని విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అతీగతిలేకుండా పోయిందని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కాలేజీ భవనాల అద్దె, ఉద్యోగులకు వేతనాలివ్వలేని స్థితికి చేరామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫీజులను విడుదల చేయాలని కోరారు. యూనియన్ ఈసీ మెంబర్స్ ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సుధీర్, బొమ్మ శ్రీధర్, కడియాల సతీశ్, ఎండీ గౌస్, ఎం మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఫీజు బకాయిలు ఒకేసారి విడుదల చేయాలి

'డిగ్రీ, పీజీ' యజమానులతో చర్చించాలి: తక్కళ్లపల్లి

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 3 విద్యాసంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదినెలలు అవుతున్నా రీయింబర్స్‌మెంట్‌పై దాటవేస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో చెల్లింపులు అంటూ నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైఫల్యాలపై ప్రశ్నిస్తే కేసులా?

- రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యాలయాలుగా మారిన పోలీస్‌స్టేషన్లు
- శ్రీనివాస్‌గౌడ్ కుటుంబంపై కక్ష సాధింపు మానుకోవాలి
- పోలీసుల చర్యలను నిలువరించాలి: డీజీపీకి మధుసూదనాచారి విజ్ఞప్తి
- పేదలకు పట్టాలివ్వాలని అడిగినందుకు నా తమ్ముడిపై కక్ష కట్టారు : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

డీజీపీ జితేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యాలయాలుగా పోలీస్ స్టేషన్లు మారిపోయాయని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబాన్ని, అతడి తమ్ముడిని అక్రమంగా వేధిస్తున్నారంటూ డీజీపీ జితేందర్‌కు గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. వారిపై పెట్టిన అక్రమ కేసులపై రివ్యూ చేసి, తక్షణమే ఎత్తివేయాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకు బీఆర్ఎస్ నేతలపై రాష్ట్రవ్యాప్తంగా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణం ఇలాంటి కక్షసాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్‌పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. బీసీలను రాజకీయాల్లో ఎదగనీయకుండా అణగదొక్కే కుట్ర జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాల నుంచి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబాన్ని తప్పించేలా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే అనేక చోట్ల బీఆర్ఎస్ నేతలపై ఇలా అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడి డీజీపీ చర్యలు తీసుకోకుంటే, ఊపేక్షించబోమని హెచ్చరించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయకపోతే తిరుగుబాటు తప్పదని స్పష్టంచేశారు.

కాంగ్రెస్ కక్షసాధింపే..

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతుకలను నొక్కుతామంటే ఎలా అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్ అంధుల కాలనీని కూలగొడితే బాధితులకు తాము ధైర్యం చెప్పి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. వారికి అన్నం పెట్టినందుకు, వచ్చిన ఆదరణ చూసి తట్టుకోలేక కాంగ్రెస్ కక్షసాధిస్తున్నదని చెప్పారు. 20 ఏండ్ల కింద కాంగ్రెస్ గవర్నమెంట్ ఇచ్చిన భూముల ఫైలు దొరకకపోతే దానికి అంధులా కారణమని ప్రశ్నించారు. వారికి పట్టాలివ్వాలని అడిగినందుకు తన తమ్ముడిపై కేసులు పెట్టించడమేంటని మండిపడ్డారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు పోలీసుల సమస్యలు, ప్రమోషన్లు, రిస్క్ అలవెన్సుల గురించి పోరాడినట్లు చెప్పారు. 'వందకు వందశాతం రేపు మా ప్రభుత్వం వస్తుంది రాసుకోండి. మీరు ఎన్ని నిర్బంధాలు పెట్టినా పడ్డీతో సహా తిరిగిచ్చేస్తాం. సీఐ, డీఎస్పీ చెప్పమన్నడని మీ పేర్లు కూడా అందులో పెడితే.. మీ కుటుంబాలు కూడా ఎంత బాధపడ్తయో మీరూ ఆలోచించాలి' అని సూచించారు. ప్రశ్నించిన వారిని ఇబ్బంది పెడుతూ.. పదేండ్లకు సరిపడా సెక్షన్లు, జీవిత ఖైదు సెక్షన్లు పెట్టి ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ పోరాటంలో ప్రాణాలకు తెగించి కొట్లాడినం. మీ పిచ్చి కేసులకు భయపడే వాళ్లం అసలేం కాదు. పోలీసు వ్యవస్థపై నమ్మకం కుదరాలంటే.. నా తమ్ముడిపై పెట్టిన కేసులను డీజీపీ సమగ్రంగా విచారణ జరిపి వారిపై కూడా చర్యలు తీసుకోవాలి' అని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాల్గొన్నారు.

కిరాయి కట్టలేదని ఎంపీడీవో ఆఫీస్‌కు తాళం

*నిజామాబాద్ జిల్లా చందూర్ ఎంపీడీవో కార్యాలయానికి 26 నెలల నుంచి అద్దె చెల్లించడం లేదని